క్లుప్తంగా

ప్రారంభమైన ఎస్‌ఏ-1 పరీక్షలు



మొవ్వ: ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో అధిక వర్షాల కారణంగా నిలిచిపోయిన సెల్ఫ్ అసెస్మెంట్ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలకు మండల పరిధిలోని 5,222 మంది విద్యార్థినీ విద్యార్థులు హాజరయ్యారని మండల విద్యాశాఖాధికారి-2 కె.శ్రీలక్ష్మి తెలిపారు. ఆమె కూచిపూడి కాంప్లెక్స్ పరిధిలోని పెడసనగంటిపాలెంలోని ఎలిమెంటరీ పాఠశాలలో జరుగుతున్న పరీక్షలను ఆమె పరిశీలించారు.

గణనాథులకు వీడ్కోలు పలికిన భక్తులు



మొవ్వ: ఈ నెల 7వ తేదీ నుంచి ప్రారంభమైన వినాయక చవితి వేడుకలకు గురువారం వినాయక నిమజ్జనాలతో ముగింపు పలికారు. కూచిపూడి పోలీసుల పర్యవేక్షణలో మొవ్వ మండలంలో ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన ఆంక్షల మధ్య వేడుకను భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. డప్పు వాయిద్యాలు, కోలాటాలు, డీజేలు, గులాంల మధ్య యువత కేరింతలతో వినాయక ఊరేగింపులు కనుల పండువగా జరిగాయి.

వరద బాధితులకు సాయం చేయండి



గుడ్లవల్లేరు: వరదలతో సర్వం పోగొట్టుకున్న బాధితులకు మనసున్న ప్రతి ఒక్కరూ సాయం చేయాలని కోరుతూ హై 5 యూత్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ గోట్రు నాగబాబు కోరారు. గుడ్లవల్లేరు ఎంఎన్‌కే ప్రధాన రహదారిపై గురువారం వరద బాధితుల సహాయార్థం దాతల నుంచి విరాళాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సెక్రటరీ కళివరపు రంగారావు, సభ్యులు ప్రత్తిపాటి రవి, నూకతోటి నాగరాజు, మద్దాల వెంకటేశ్వరరావు, దుర్గరాజు పాల్గొన్నారు.

స్వయం సహాయక సంఘాల విరాళం



మండవల్లి: విజయవాడ వరద బాధితుల సహాయం నిమిత్తం స్వయం సహాయక సంఘాల మహిళలు రూ.79,999 చెక్కును ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్‌కు గురువారం మండవల్లిలో అందజేశారు. ముంపు రహిత గ్రామాల బుక్ కీపర్లు కొల్లేటి ముంపునకు గురైన తోటి బుక్ కీపర్లకు గ్రామ సంఘాల ప్రెసిడెంట్‌లకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. మినపప్పు, ఇడ్లీ రవ్వ, వేరుశనగ గుళ్లు, నూనె ప్యాకెట్, కందిపప్పు తదితర వస్తువులను ఎమ్మెల్యే చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఏపీఎం రాజశ్రీ పాల్గొన్నారు.

చెత్తాచెదారాల తొలగింపు

మండవల్లి: మండలంలోని పెరికెగూడెం శ్మశానవాటిక, వాటర్ ట్యాంక్‌ల వద్ద సర్పంచ్ పెరుమాళ్ళ పద్మ ఆధ్వర్యంలో గురువారం చెత్తా చెదారాలు తొలగించారు. దట్టంగా ఉన్న గడ్డి తొలగింపునకు మందు పిచికారీ చేశారు. వైఎస్సార్ సీపీ నాయకుడు పెరుమాళ్ళ సత్యనారాయణ పాల్గొన్నారు.

వృత్తి విద్యా కోర్సుల్లో 23 నుంచి ఉచిత శిక్షణ



నిమ్మకూరు(పామర్రు): నిమ్మకూరు గ్రామంలోని జిల్లా శిశు, మహిళా ప్రాంగణంలో ఈనెల 23వ తేదీ నుంచి మహిళలకు వృత్తి విద్యాకోర్సులు ప్రారంభం కానున్నాయని ప్రాంగణం జిల్లా మేనేజర్ డాక్టర్ జుబేదా పర్వీన్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నెల రోజుల పాటు ఈ శిక్షణ తరగతులు ఉంటాయని తెలిపారు. ఈ తరగతులలో గార్మెంట్ కట్టర్, కుట్టుమిషన్, దాని మెకానిజం, మేకప్ ట్రైనర్ తదితర కోర్సుల్లో తర్ఫీదు ఇస్తారని చెప్పారు. జిల్లాలో ఆసక్తి గల మహిళలు అందరూ నిమ్మకూరు గ్రామంలోని మహిళా ప్రాంగణంలో సంప్రదించాలని కోరారు.

జీవనోపాధికి గండి కొట్టిన బుడమేరు

- 20 రోజులైనా లంక గ్రామాల్లో నేటికీ తగ్గని నీరు
- పనులు కరువైన కూలీలు
- ఉపాధి కోల్పోయిన వేలాది మంది ప్రజలు
- ఆక్వా సంబంధిత రంగాలపై తీవ్ర ప్రభావం
- చిరు ఉద్యోగులు, కార్మికులకు ఆదాయం లేదు



మండవల్లి మండలం మూడుతాళ్లపాడు వద్ద ఇప్పటికీ రోడ్డుపై తగ్గని వరద నీరు

కైకలూరు: బుడమేరు ముంపు, అధిక వర్షాలు చేసిన గాయంతో కొల్లేరు గ్రామాలు విలవిలలాడాయి. ఆక్వా సంబంధిత రంగాలపై ఆధారపడిన లక్షలాది మంది ముంపు కారణంగా ఉపాధి కోల్పోయారు. ముంపు సంభవించి దాదాపు 20 రోజులు కావస్తున్నా ఇప్పటికీ కొన్ని లంక గ్రామాల్లో నీరు బయటకు వెళ్లలేదు. మండవల్లి మండలంలో పెనుమాకలంక, ఇంగిలిపాకలంక, నందిగామలంక, శ్రీరామ్‌నగర్, మూడుతాళ్లపాడు వద్ద రోడ్డుపై నీరు ఇప్పటికీ తగ్గలేదు. పనులు లేక అనేక మంది కూలీలు ఇబ్బందులు పడుతున్నారు.

రూ.350 కోట్ల మేరకు నష్టం

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 2.40 లక్షల ఎకరాల్లో చేపల, రొయ్యల సాగు జరుగుతోంది. ఇరు జిల్లాల్లో 9 మండలాల్లో 122 కొల్లేరు పరివాహక గ్రామాలు ఉన్నాయి. బుడమేరు, ఇతర డ్రెయిన్ల నుంచి నీరు చేరడం, అధిక వర్షాల కారణంగా కొల్లేరు పరివాహక గ్రామాలు నీట మునిగాయి. మండవల్లి మండలం పెనుమాకలంక గ్రామస్తులు ఇప్పటికీ పెదఎడ్లగాడి నుంచి పడవలపైనే ప్రయాణిస్తున్నారు. దాదాపు 10 ఎకరాల పైనే కొల్లేరులో చేపల, రొయ్యల చెరువులకు గండ్లు పడి కొల్లేరు పాలయిందని అంచనా. ఇది మరింత పెరిగే అవకాశం ఉంది. ఇప్పటి వరకు సుమారు రూ.350 కోట్లు నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు.

ఉపాధి కోల్పోయిన ఆక్వా రంగం

ముంపు కారణంగా కొల్లేరు పరివాహక ప్రాంత ప్రజలు, ఆక్వారంగంపై ఆధారపడి జీవిస్తున్న అనేక మంది వృత్తిదారులు ఉపాధి కోల్పోయారు. కొల్లేరు పరివాహక ప్రాంతాల నుంచి ప్రతిరోజు 200 నుంచి 250 లారీల చేపలు, రొయ్యలు ఇతర ప్రాంతాలకు ఎగుమతి అవుతుంటాయి. అటువంటిది 20 రోజులు పైబడి పట్టుబడులు లేవు. చేపల పట్టుబడులకు వెళితే ప్రతి రోజు ఒక్కో వ్యక్తికి రూ.700 కూలీగా లభిస్తుంది. అదే విధంగా లారీ, వ్యాన్ డ్రైవర్లు, క్లీనర్లు, యజమానులు, ఆక్వా దుకాణాలు, ల్యాబొరేటరీలు, హేచరీదారులు, వలల కూలీలు, గ్యాస్ సరఫరాదారులు, ఎలక్ట్రీషియన్లు, ఆక్వా మేతల ఏజెంట్లు, డీలర్లు, కాపలాదారులు ఇలా అనేక రంగాల్లో వారికి ఉపాధి లేకుండా పోయింది. ముంపు బారిన పడిన గ్రామాల్లో 15 రోజులుగా బయటకు వచ్చే అవకాశం లేకపోవడంతో చిన్న చిన్న ఉద్యోగాలు చేసుకునే యువత ఉపాధి కోల్పోయింది. ఈ విధంగా ఆక్వాను నమ్ముకున్న అన్ని రంగాలు దెబ్బతిన్నాయి.

రహదారులు ఛిద్రం

కొల్లేరు వరదల కారణంగా పరివాహక గ్రామాల రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయి. ప్రధానంగా పెనుమాకలంక నుంచి ఇతర గ్రామాలకు వెళ్లే రహదారిలో పెద్దపెద్ద గుంతలు పడ్డాయి. కైకలూరు మండలం సర్కారు కాల్వ నుంచి పెద్దింట్లమ్మ దేవస్థానం చేరే రహదారి దెబ్బతింది. వరదలలో చిక్కుకున్న భారీ వాహనాలను బయటకు తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు దెబ్బతిన్న రహదారులకు వెంటనే మరమ్మతులు చేయించాలని కొల్లేరు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఉపాధి కోల్పోయాం



కొల్లేరు ప్రాంతంలో నిత్యం పని ఉండేది. ప్రధానంగా చేపల, రొయ్యల పట్టుబడులు ఎక్కువగా ఉండేవి. వరదల కారణంగా పనులు కోల్పోయాం. ఇప్పటికీ చేపల, రొయ్యల చెరువులు ముంపులో ఉన్నాయి. ఈ నీరంతా బయటకు పోవడానికి మరికొంత సమయం పట్టవచ్చు. పనులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం.

– బలే రామాంజనేయులు, పెనుమాకలంక

ప్రభుత్వం ఆదుకోవాలి



ముంపు కారణంగా ఆక్వా రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ ప్రాంతంలో వేలాది మంది ఆక్వా రంగాన్ని నమ్ముకుని బతుకుతున్నాం. పట్టుబడులు, ప్యాకింగ్ ఇలా అనేక పనులతో ఉపాధి పొందుతున్నాం. మూడు వారాలుగా పనులు లేవు. దీంతో కుటుంబ పోషణ కష్టమవుతోంది. ప్రభుత్వం ఆదుకుని చేయూత ఇవ్వాలి.

– ఘంటసాల దుర్గారావు, కూలీ, శ్రీరామ్‌నగర్

ఎంపీపీ చందనకు డీఎన్నార్ పరామర్శ

కైకలూరు: కలిదిండి మండల ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు తండ్రి చందన కోటేశ్వరరావు ఇటీవల మరణించిన నేపథ్యంలో గురువారం ఆయన సంతాప సభ స్వగ్రామం కోరుకొల్లులో నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) ఈ కార్యక్రమానికి హాజరై ఎంపీపీ కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ చెన్నంశెట్టి నాగరాజు, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు చెన్నంశెట్టి సోమేశ్వరరావు, ఆవకూరు మాజీ సర్పంచ్ వడ్డి గంగరాజు, వలవల ప్రసాద్, వలవల గంగరాజు, వలవల చిన్న, వలవల సత్యనారాయణ, గురుజు శివయ్య, గుడాల త్రిమూర్తులు, చందన శ్రీను, వాడపల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



చందన కోటేశ్వరరావు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న డీఎన్నార్

పామర్రు డ్రెయిన్‌కు అడ్డంకిగా పిచ్చి మొక్కలు

పట్టించుకోని అధికారులు

పామర్రు: గ్రామంలో ఉన్న పామర్రు డ్రెయిన్ ప్రవాహానికి పక్కనే పెరిగిన పిచ్చిమొక్కలు అడ్డంకిగా మారుతున్నాయి. అసలే డ్రెయిన్ ఆక్రమణలకు గురై బక్కచిక్కిపోయింది. దీనికి తోడుగా పిచ్చిమొక్కలు విపరీతంగా పెరిగి మురుగునీరు దిగువకు పోయే పరిస్థితి లేక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ డ్రెయిన్‌లోకే పరిసర ప్రాంతాల్లో ఉన్న కొందరికి సంబంధించిన మరుగుదొడ్ల నుంచి వచ్చే నీటిని కలుపుతూ గొట్టాలను ఏర్పాటు చేశారు. దీని వలన డ్రెయిన్‌లోని నీరు దుర్వాసన వెదజల్లుతోంది. అంతేకాకుండా డ్రెయిన్‌పై ర్యాంపులు, తూములు ఏర్పాటు చేసి డ్రెయిన్ ప్రవాహానికి అడ్డంకులు సృష్టిస్తున్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులు తక్షణం స్పందించి డ్రెయిన్‌లో నీరు దిగువకు సక్రమంగా పోయే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



పామర్రు డ్రెయిన్‌కు అడ్డంకిగా పెరిగిన మొక్కలు

అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసిన సర్పంచ్

ముదినేపల్లి రూరల్: శ్రీహరిపురం పంచాయతీ పరిధిలోని నాలుగు అంగన్‌వాడీ కేంద్రాలను సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందజేస్తున్న పోషకాహారాల గురించి వివరాలు సేకరించారు. కేంద్రాల్లో ఉన్న సరుకులను స్టాక్ రిజిస్టర్లతో సరిపోల్చి సంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్రాల్లో ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని పంచాయతీ పరంగా వాటి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.



అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సర్పంచ్ విశ్వేశ్వరరావు

నిత్యావసర వస్తువుల పంపిణీ

మండవల్లి: మూడుతాళ్లపాడు శివారు ఆనందపురంలో వరద బాధితుల సహాయార్థం ముంపు ప్రాంత ప్రజలకు యూటీఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వరరావు, జిల్లా విద్యాశాఖ అధికారి అబ్రహాం, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముస్తఫా ఆలీ, రవికుమార్ రుద్రాక్షి, రాష్ట్ర కార్యదర్శి బి.సుభాషిణి, జిల్లా కోశాధికారి జీవీ రంగమోహన్ తదితరులు పాల్గొన్నారు.



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న యూటీఎఫ్ జిల్లా నాయకులు

అతిథి అధ్యాపక పోస్టు భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కైకలూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో కామర్స్ అతిథి అధ్యాపకుని పోస్టుకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా ప్రిన్సిపాల్ ఎస్.శాంతిజ్యోతి గురువారం ఒక ప్రకటనలో కోరారు. గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఎంకాంలో కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 21వ తేదీ మధ్యాహ్నం 2 గంటలలోపు కాలేజీలో దరఖాస్తులు అందించాలన్నారు. ఈ నెల 23వ తేదీ ఉదయం 11 గంటలకు ఇంటర్వ్యూ ఉంటుందన్నారు. ఒరిజనల్ సర్టిఫికెట్లతో అభ్యర్థులు హాజరు కావాలని, వివరాలకు 94949 11486 సెల్ నంబరులో సంప్రదించాలని కోరారు.

లడ్డూ వేలం పాడిన పోలీసులు



ముదినేపల్లి రూరల్: స్థానిక వై జంక్షన్‌లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద గురువారం చవితి ఉత్సవాలు ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వాహకులు స్వామివారి విగ్రహాన్ని భారీ ఊరేగింపుతో స్థానిక పోల్‌రాజ్ కాలువలో నిమజ్జనం చేశారు. ఉత్సవాల్లో ఎస్‌ఐ డి.వెంకటకుమార్ స్వామి లడ్డూ ప్రసాదాన్ని వేలంలో దక్కించుకుని సిబ్బందికి, భక్తులకు పంపిణీ చేశారు.

మండవల్లిలో చురుకుగా పారిశుద్ధ్య పనులు



మండవల్లి: మండవల్లిలోని అన్ని వార్డుల్లో గత 8 రోజుల నుంచి పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ మెండా ఝాన్సీ గురువారం చెప్పారు. ఈ సందర్భంగా పంచాయతీ సిబ్బందితో చెత్తా, చెదారాలను తొలగించి సున్నం, బ్లీచింగ్ చల్లిస్తున్నట్లు తెలిపారు.

కిశోర బాలికలకు అవగాహన

మండవల్లి: పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా గురువారం మండవల్లి హైస్కూల్‌లో కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. పౌష్టికాహారం తీసుకోవడం వలన ప్రయోజనాలు, బాల్యవివాహాలు చేయడం వలన కలిగే నష్టాలు తదితర విషయాలను వివరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్‌వీ నాగలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు సీహెచ్ ఉమాదేవి, సుధారాణి, జయలక్ష్మి, శ్రీదేవి, నాగలక్ష్మి, ఏఎన్ఎం కనకదుర్గ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



మండవల్లి హైస్కూల్‌లో కిశోర బాలికలకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ నాగలక్ష్మి

గణనాథునికి ఘనంగా వీడ్కోలు

కైకలూరు: వినాయక చవితి ముగింపు సందర్భంగా పలు గ్రామాల్లో గురువారం చవితి పందిర్ల వద్ద ఊరేగింపులు, అన్నసమారాధనలు అట్టహాసంగా జరిగాయి. ఆటపాక కోదండ రామాలయం వద్ద వినాయక నిమజ్జన ఉరేగింపును ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ప్రారంభించారు. కైకలూరు కూరగాయలు, పండ్ల వర్తక సంఘం ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన జరిగింది. వేలాది మంది భక్తులు స్వామివారి ప్రసాదం స్వీకరించారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్ రావు, కూటమి నేతలు కొల్లి బాబి పాల్గొన్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం



కైకలూరు బాలికల హైస్కూల్‌లో విద్యార్థుల ర్యాలీ

కైకలూరు: విద్యార్థి దశ నుంచి పోషకాహారంపై మహిళలకు పూర్తి అవగాహన ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కృష్ణకుమారి చెప్పారు. పోషకాహార పక్షోత్సవాల్లో భాగంగా గురువారం కైకలూరు బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాల, వెలమపేట ఎంపీయూపీ స్కూల్‌లో పోషకాహార ప్రయోజనాలను వివరించారు. బాలికల ఉన్నత పాఠశాలలో బాలికలకు రక్త పరీక్షలు చేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు ఆదిలక్ష్మి, కృష్ణవేణి, ఎంఎల్‌హెచ్‌పీఎస్ పద్మావతి, మాధవి, అంగన్‌వాడీలు మీనాకుమారి, వెంకటేశ్వరమ్మ, విజిత, కల్పన, దేవి, ఎస్‌కే ఆసియా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హాస్టల్ బాలికల వసతులపై జడ్జి ఆరా



విద్యార్థినులతో మాట్లాడుతున్న జడ్జి సుధారాణి

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు బాలికల వసతి గృహంలో విద్యార్థినుల వసతి సౌకర్యాలపై గుడివాడ జడ్జి ఎం.సుధారాణి ఆరా తీశారు. ఏపీ రాష్ట్ర న్యాయ సేవా సంస్థ వారి ఉత్తర్వుల మేరకు గురువారం ఆమె హాస్టల్‌ను సందర్శించారు. బాలికలకు కల్పించే ఆహారం, కాస్మోటిక్స్, టాయిలెట్స్ గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. బాలికలకు ఏమైనా సమస్యలు ఉంటే మండల న్యాయ సేవాధికార కమిటీ వారిని సంప్రదించవచ్చునని తెలిపారు. ఆమె వెంట గుడ్లవల్లేరు ఎస్‌ఐ సత్యనారాయణ, లీగల్ వలంటీర్లు ఉన్నారు.

గర్భిణులకు సామూహిక శ్రీమంతాలు

పామర్రు: పోషకాహార మాసోత్సవాలలో భాగంగా గర్భిణులకు సామూహిక శ్రీమంతాలను నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ సీడీపీవో వి.భానుశ్రీ తెలిపారు. మండలంలోని కురుమద్దాలి గ్రామంలో అంగన్‌వాడీ-1 కేంద్రంలో గురువారం గర్భిణులకు సామూహిక శ్రీమంతాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ గర్భిణులు ఆరోగ్యవంతంగా ఉంటేనే పుట్టబోయే బిడ్డ కూడా ఆరోగ్యంగా ఉంటుందని అన్నారు. గర్భిణులు ప్రతిరోజూ పౌష్టికాహారంతో కూడిన పదార్థాలను తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గోట్రు విజయభారతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.విజయకుమారి, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, బాలింతలు పాల్గొన్నారు.

జుఝువరంలో...

జుఝువరం గ్రామంలో గురువారం గర్భిణులకు సామూహిక శ్రీమంతాలను నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పుట్టి పున్నమ్మ పాల్గొని గర్భిణులకు శ్రీమంతాలను చేశారు. గర్భధారణ సమయంలో సంరక్షణ, ఆహారంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.



సామూహిక శ్రీమంతాలను నిర్వహిస్తున్న సీడీపీవో భానుశ్రీ, సర్పంచ్ విజయభారతి

వంద రోజుల పాలనలో ఒరిగిందేమీ లేదు

సీపీఎం జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్సీపీ రెడ్డి

గుడివాడరూరల్: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ వంద రోజుల్లో దేశానికి ఒరిగిందేమీ లేదని సీపీఎం జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్సీపీ రెడ్డి అన్నారు. స్థానిక సుందరయ్య భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ గత ఎన్నికల్లో దేశాభివృద్ధికి ఎన్నో చేస్తామని కల్లబొల్లి మాటలు చెప్పి మూడోసారి అధికారంలోకి వచ్చిందన్నారు. ఈ వంద రోజుల బీజేపీ పాలనలో దేశాభివృద్ధి ఏమీ జరగలేదన్నారు. ఉపాధి లేక ప్రజలు అల్లాడుతున్నారన్నారు. ధరలు విపరీతంగా పెరిగిపోయి సామాన్యుడికి బతకడం కష్టంగా మారిందన్నారు. ముఖ్యంగా నిరుద్యోగ సమస్య పరిష్కరిస్తామని చెప్పిన బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగుల గురించి పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ బలంగా ఉందని వట్టి కబుర్లు చెప్పడమే గాని ఆ పరిస్థితి లేదన్నారు. ధనవంతులు మిలియనీర్లు, బిలియనీర్లు అవుతున్నారని, పేదవాడు పేదవాడిగానే ఉండిపోతున్నారన్నారు. ఇప్పటికైనా కళ్లు తెరిచి దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా చూడాలన్నారు. సమావేశంలో ఐద్వా పట్టణ కార్యదర్శి పి.రజని, సీపీఎం పట్టణ కమిటీ సభ్యుడు రేపాణి కొండలు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఆర్సీపీ రెడ్డి

బహిరంగ మల విసర్జన రహిత గ్రామంగా చర్యలు

జమీదగ్గుమిల్లి(పామర్రు): బహిరంగ మల విసర్జన రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామని జమీదగ్గుమిల్లి గ్రామ సర్పంచ్ కె.చంద్రశేఖర్‌రావు అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో గురువారం పంచాయతీ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఇంటికీ తిరిగి మరుగుదొడ్డి ఉందా లేదా అని ఆరా తీసి లేని వారిని గుర్తించామని చెప్పారు. మరుగుదొడ్డి లేని ప్రతి ఇంటికీ తన సొంత నిధులు రూ.15 వేలు ఇస్తానన్నారు. గ్రామాన్ని బహిరంగ మల విసర్జన రహిత గ్రామంగా ప్రకటించానని తెలిపారు. గ్రామంలో ప్రతి ఇంటికి మంచినీటి కుళాయి కనెక్షన్లు ఇప్పించి నూరు శాతం కుళాయిలు ఉన్న గ్రామంగా తీర్చిదిద్దినందుకు జలజీవన్ మిషన్ వారు జమీదగ్గుమిల్లి గ్రామాన్ని 'హర్ ఘర్ జల్' గ్రామంగా ప్రకటించారని చెప్పారు. గ్రామాన్ని మరింత అభివృద్ధి పథంలో పయనించేలా అన్ని ఏర్పాట్లు చేసేందుకు సమాయత్తం అవుతున్నామని సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ భారతి, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జమీదగ్గుమిల్లి సర్పంచ్ చంద్రశేఖర్‌రావు

ఐటీఐ కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రిన్సిపాల్ ఎల్.గౌరీమణి

గుడివాడరూరల్: గుడివాడ ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో 2024-25, 2025-26 విద్యా సంవత్సరాలకు సంబంధించి అడ్మిషన్లు పొందుటకు నాలుగో విడత ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గుడివాడ ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.గౌరిమణి గురువారం ఓ ప్రకటనలో కోరారు. ఎనిమిది, పదో తరగతులు ఉత్తీర్ణులైన వారు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో ప్రవేశాలకు ఐటిఐ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 26వ తేదీ లోపు దరఖాస్తులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఈనెల 28న ప్రభుత్వ ఐటీఐ, 30న ప్రైవేట్ ఐటీఐలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. ఆన్‌లైన్‌లో ఎటువంటి పొరపాట్లు లేకుండా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులు పూర్తిచేసిన అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలలకు వెళ్లి వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. ఈనెల 27వ తేదీలోపు ఈ ప్రక్రియ ముగించి ప్రిన్సిపాల్ ద్వారా అప్రూవల్ చేయించుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు జిల్లా కన్వీనర్ కార్యాలయం, గుడివాడ ఐటీఐ ప్రభుత్వ కళాశాలలో సంప్రదించాలని, లేదా 08674-295953, 85559 52320, 82975 74757, 99851 62555లలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ కోరారు.

ఉప్పుటేరు అడ్డంకులను తొలగిద్దాం

కైకలూరు: కలిదిండి మార్కెట్ యార్డులో మండల రైతులతో ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎగువ నుంచి కొల్లేరుకు చేరే వరద నీరు సముద్రంలో కలవాలంటే ఉన్న ఏకైక మార్గం ఉప్పుటేరు మాత్రమే అని అన్నారు. ఉప్పుటేరులో కిక్కిస, గుర్రపుడెక్క వల్ల నీటి పారుదల వేగం తగ్గి గ్రామాలు ముంపునకు గురవుతున్నాయన్నారు. రైతులు అందరూ స్వచ్ఛందంగా ఎప్పటికప్పుడు గుర్రపుడెక్కను తొలగించాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, చేపల రైతు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు తాడినాడ బాబు, కూటమి నేతలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్